క్లుప్తంగా

పనుల్లో నాణ్యత తప్పనిసరి

గార: ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీల్లో జరుగుతున్న మెటీరియల్ కాంపొనెంట్ పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ సుధాకరరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం సతివాడలో సిమెంట్ రోడ్డును పరిశీలించారు. నిబంధనల మేరకు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.జిల్లాలో రూ.238.6 కోట్లతో పనులు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దవళపేటలో వైద్య శిబిరం

జి.సిగడాం: మండలంలోని దవళపేటలో జి.సిగడాం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పేకల సుమబిందు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, ఏఎన్ఎం సూజాత, ఎంఎల్‌హెచ్‌పీ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త పేడాడ పెద్దలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తెప్పోత్సవం విజయవంతం

అరసవల్లి: కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా అరసవల్లిలో బుధవారం నిర్వహించిన తెప్పోత్సవం విజయవంతమైందని, ఇందుకు సహకరించిన ప్రభుత్వ శాఖాధికారులకు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఈవో వై.భద్రాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దర్శనానికి వచ్చిన వేలాది మంది భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా ఉత్సవం జరిగిందని తెలిపారు.

విద్యుత్ చార్జీలపై సీపీఎం నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రణస్థలం: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ అమ్మన్నాయుడు, వెలమల రమణ డిమాండ్ చేశారు. గురువారం రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థాలు జంక్షన్ వద్ద ప్రజాపోరు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజలు, వ్యాపారులకు తీవ్ర నష్టదాయకమైన విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు


ప్రశంసాపత్రాలతో చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో బాల కథా నిలయం నిర్వహణలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు చిత్రలేఖనం, దేశభక్తి పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలను, బహుమతులను బాల కథానిలయం ప్రతినిధి బి.ఉమామహేశ్వరరావు అందించారు. అనంతరం లాఫింగ్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్.పట్నాయిక్, ఎస్.ఈశ్వరరావు, దీప్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏడురోడ్ల కూడలిలో పాతబ్రిడ్జిపై గురువారం ఓ వృద్ధుడు చెయ్యి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇతను కోటేశ్వరాలయం, హనుమ ఆలయం పరిసరాల్లో తిరుగుతుండేవాడు. మద్యం మత్తులో ఇలా చేసి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. బాధితుడిని అంబులెన్సులో రిమ్స్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు అభినందనలు

శ్రీకాకుళం క్రైమ్ : కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బంది సేవలకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అభినందనలు తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన వీరికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించారు.

ఆరుగురు జూదరులపై కేసు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం సమీపంలో గురువారం సాయంత్రం జరుగుతున్న పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. రూ.14600 నగదు, 6 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

7 నుంచి రంగస్థల కళాకారుల రజతోత్సవ సంబరాలు

శ్రీకాకుళం కల్చరల్: రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం రజతోత్సవ వేడుకలు డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షులు చిట్టి వెంకటరావు తెలిపారు. రంగస్థల కళాకారుల కార్యాలయంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి, గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగ స్వామి, గణేష్‌యాదవ్, బీఎస్‌భూషణ్, హరి సత్యనారాయణ, వాసుదేవాచారి పాల్గొన్నారు.

జోరుగా పశుగణన

- ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో సర్వే
- 16 రకాల జాతుల గుర్తింపు
- లెక్కింపు ఆధారంగా వ్యాధులకు మందులు


బోయివానిపాలెంలో పశుగణన చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఐదేళ్లకు ఒకసారి జాతీయ స్థాయిలో నిర్వహించే పశుగణన కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది జోరుగా చేపడుతున్నారు. 21వ జాతీయ పశుగణన కార్యక్రమం 2025 ఫిబ్రవరి 28 వరకు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పశుగణన చేపడుతున్నారు. వీరికి గత నెల 24న పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలో 32 మంది పశు సంవర్ధక సహాయకులు, 11 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఇంటింటికీ వెళ్లి పశువుల సంఖ్యను లెక్కిస్తున్నారు. ప్రభుత్వం ప్రధానంగా 16 రకాల జాతుల పశువులను గుర్తించేందుకు ఎన్యుమరేటర్ల ద్వారా గ్రామ, పట్టణంలో రైతుల పశువుల పాక వద్దకు వెళ్లి వివరాలను ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తోంది. వివిధ రకాలైన పశువుల పెంపకందారులు ప్రభుత్వ యాప్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల రైతుకు మేలు జరుగుతుంది.


వెంకటాపురంలో ఇంటింటా సర్వే చేస్తున్న సిబ్బంది

లెక్కింపులోకి వచ్చే పశువులు

పశు గణనలో ఆవులు, ఎద్దులు, దున్నలు, కుక్కలు, గాడిదలు, పందులు, కుందేళ్లు, గొర్రెలతో పాటు అనేక రకాలైన పశువులను ఎన్యుమరేటర్లు గుర్తిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తింపులో ఉన్న పశువులకు మాత్రమే నష్ట పరిహారం చెల్లిస్తారు. గతేడాది కంటే ఈ ఏడాది పశువులు శాతం పెరిగే అవకాశముంది. రైతులు పశువులకు బీమా చేయించడం వల్ల అవి మృత్యువాత పడిన వెంటనే పశు సంవర్ధక శాఖ అధికారులు పోస్టుమార్టం ఆధారంగా బీమాకు అవకాశం కల్పిస్తారు.

పశు బీమాతో ఎంతో మేలు



సుమారు 5 ఏళ్లుగా వ్యవసాయంతో పాటు పాడి రైతుగా ఉన్నాను. మనిషికి బీమా ఎలా అవసరమో.. పాడి పశువులకు కూడా అంతే అవసరం. ప్రకృతి వైపరీత్యాలు, అనివార్య కారణాల వల్ల పాడి పశువులు మృతి చెందినట్లయితే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. పశుగణనతో పాటు ఇన్సూరెన్స్ చేయించడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది.

– చందక నారాయణరావు, పాడి రైతు, మురపాక

పశువులకు బీమా తప్పనిసరి



వివిధ రకాలైన పశువులను పెంచేవారు ప్రభుత్వ ఆదేశాల మేరకు బీమా పాలసీ చేయడం వల్ల అవి మృత్యువాత పడినట్లయితే లాభం చేకూరుతుంది. ఎన్యుమరేటర్లు, సిబ్బంది వచ్చినప్పుడు పశువుల పెంపకందారులు తప్పనిసరిగా పూర్తి వివరాలు ప్రభుత్వ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. పశువులు వ్యాధులబారిన పడినప్పుడు సకాలంలో ప్రభుత్వం నుంచి మందులు ఉచితంగా అందుతాయి. కొంతమంది పశుగణన ఇబ్బంది పడి వివరాలు చెప్పడం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి పొందే సహాయం అందదు.

– దుర్గారావు, పశుసంవర్ధకశాఖ ఏడీ

చిన్నారుల చిరుసాయం



శ్రీకాకుళంలోని బెహరా మనోవికాస కెంద్రంలో ప్రత్యేకావసరాల చిన్నారులకు గురువారం భాష్యం స్కూల్ విద్యార్థులు నిత్యావసర వస్తువులు, బిస్కెట్లు అందజేశారు. పాకెట్ మనీని దాచుకుని బాలల దినోత్సవం సందర్భంగా వీటిని అందజేయడంతో అందరూ అభినందించారు. నగరంలోని ఖ్యాతి వృద్ధాశ్రమంలోనూ స్కూల్ ప్రతినిధి ఆర్.శ్రావణి ఆధ్వర్యంలో వస్తువులు, పండ్లు అందించారు. -శ్రీకాకుళం కల్చరల్

'ప్రత్యేక' శిక్షణ



హౌసింగ్ బోర్డు కాలనీలోని బెహరా మనోవికాస కేంద్రంలో క్రాఫ్టిజెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకావసరాల చిన్నారులకు పర్యావరణ హాని లేని వస్తువులైన అగరబత్తి, హోలీ పౌడర్, కొవ్వొత్తులు, పేపర్ బ్యాగులు వంటి వస్తువుల తయారీపై గురువారం శిక్షణ ఇచ్చారు. సంస్థ ప్రతినిధి జాన్ మాట్లాడుతూ స్కిల్లింగ్ అనే ఈ కార్యక్రమం ద్వారా పిల్లలకు శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

నేడు కైలాసగిరి ప్రదక్షిణ



జి.సిగడాం మండలంలోని ఎందువ గ్రామంలో కొండపై వెలిసిన కైలాశేశ్వర క్షేత్రం వద్ద శుక్రవారం జరగనున్న గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కైలాసగిరి క్షేత్రం శివ దీక్షభక్త బృందం, వేదపండితులు నేతేటి సన్యాసిరావుశర్మ, నేతేటి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచే ప్రదక్షిణ ప్రారంభం కానుంది. -జి.సిగడాం

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ


మహిళా డిగ్రీ కళాశాలలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

గార/ఎచ్చెర్ల/జి.సిగడాం/శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, ఏపీబీసీడబ్ల్యూఆర్(జి) ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సోడవరం ఈశ్వరరావు, సిబ్బంది ప్రత్యూష, రాంబాబు, వరలక్ష్మి, కళ్యాణి, రామ్మోహన్, భానుమతి, మురళీకృష్ణ, గణేష్ పాల్గొన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గారలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.రామకృష్ణ, లైబ్రేరియన్ ఎస్.రామకృష్ణ, కళింగపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇందిర, లావేరు శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ అధికారి మురపాక శ్రీనివాసరావు, ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం పి.జగన్నాథం, జి.సిగడాం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ వెంకటేష్ పాల్గొని వారోత్సవాల ఉద్దేశాన్ని వివరించారు.

బలగశాఖ (హడ్కోకాలనీ) గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ పి.ఉగ్రసేను, టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, పీఎల్‌పీ భారతి, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ హయాతీనగరంలోని మహాత్మజ్యోతిభాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ మొదలవలస ఇందువదన, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మాకెందుకీ శిక్షణ?


అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు ఎంపీటీసీలు


జి.సిగడాం: 'మేం గ్రామ సర్పంచులం. కూటమి ప్రభుత్వం మా మాటకు ఎవరూ విలువ ఇవ్వడం లేదు. మండల, గ్రామస్థాయి అధికారులు ఎలాంటి సమాచరం ఇవ్వరు. అలాంటప్పుడు మాకెందుకీ శిక్షణ?' అంటూ జి.సిగడాం మండలానికి చెందిన సర్పంచ్‌లు కాముజుల సీతారాం, సాకేటి నాగరాజు, మహదాస్యం చిన్నారావు, తిరుమరెడ్డి వెంకటరావు, వడిశ మహేశ్వరరావు, బెవర జగన్నాథం, గోక మహేశ్వరరావు, అల్లు జోగినాయుడు, తొత్తడి రామారావు , పెద్ది శ్రీనివాసరావు, గేదెల నారాయణరావు తదితర సర్పంచులు, ఎంపీటీసీలు కలిసి అధికారులను నిలదీశారు. మీరిచ్చిన రుణాలు లబ్ధిదారులు తిరిగి చెల్లించకపోతే అప్పుడు తాము గుర్తుకొస్తామా అంటూ ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడును ప్రశ్నించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రామకృష్ణరావు ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరిగింది.


ఎచ్చెర్ల: గ్రామ పంచాయతీలకు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక తయారుచేసి ప్లాన్‌ను గ్రామ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయని పీఆర్ అండ్ ఆర్‌డీ సహాయ కమిషనర్, ఏపీఎస్ఐఆర్‌డీ స్టేట్ అబ్జర్వర్ ఈ.కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ తరగతులు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గార: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు జరిగిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ జరిగింది. ఎంపీపీ గొండు రఘురామ్, జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాతమ్మ, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే మధుమేహం నియంత్రణ


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం(పీఎన్ కాలనీ)/శ్రీకాకుళం/శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం అర్బన్: ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తే మధుమేహం(షుగర్) వ్యాధిని నియంత్రణలో ఉంచవచ్చునని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. రైతుబజారు జంక్షన్‌లో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో గురువారం ఉచిత మధుమేహ వైద్యశిబిరం నిర్వహించగా.. 300 మంది వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్, అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథంనాయుడు, చింతాడ కృష్ణమోహన్, జోన్ చైర్మన్ కరణం శోభారాణి, లయన్ డాక్టర్ మెడిశెట్టి సత్య స్వరూప్ తదితరులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ కెల్ల చిన్నబాబు 120 మందికి రక్తపోటు, మధుమేహ వ్యాధి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిక్కు అప్పన్న, బి.చిన్మయరావు, పి.చైతన్యకుమార్, గొలివి రమణ పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాంబే కాలనీలో మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డా.బొడ్డేపల్లి సురేష్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మెంటర్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, డీసీ బడాన దేవభూషణ్, క్లబ్ సెంట్రల్ కోశాధికారి జోగి భారతి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం


ధర్మవరం పాఠశాలలో మేముసైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాలు, గ్రంథాలయాల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. - సాక్షి నెట్‌వర్క్


శ్రీకాకుళం అర్బన్: అరసవల్లిలోని చిల్డ్రన్ హోమ్‌లో బాలల సమక్షంలో కేక్ కట్ చేసిన కలెక్టర్


జి.సిగడాం: నెహ్రూ వేషధారణలో అద్వాన్నంపేట ఎంపీపీ స్కూల్ చిన్నారులు


శ్రీకాకుళం పాతబస్టాండ్: పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొమ్ము రమణమూర్తి


శ్రీకాకుళం పాతబస్టాండ్: పిల్లలతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు


శ్రీకాకుళం అర్బన్: బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు


శ్రీకాకుళం అర్బన్: ఇన్‌స్పైర్ పాఠశాలలో విజేతలతో ఎస్ఐ హరికృష్ణ, రోటరీ ప్రతినిధులు


జి.సిగడాం: విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఎంఈఓలు అరసాడ రవి, ముళ్లు శ్రీనివాసరావు


శ్రీకాకుళం కల్చరల్: బొంతావారివీధిలో దేశనాయకుల వేషధారణలో చిన్నారులు


శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరంలోని ఎంజేపీఏపీ బీసీఆర్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి


శ్రీకాకుళం అర్బన్: నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఎచ్చెర్ల: బహుమతులతో లావేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు


గార: ప్రశంసాపత్రాలతో వాడాడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు


శ్రీకాకుళం న్యూకాలనీ:శర్వాణి విద్యాలయ పాఠశాలలో వేడుకల్లో అంధవరపు సూరిబాబు, తదితరులు


శ్రీకాకుళం న్యూకాలనీ:విశాఖ స్కూల్లోని వేడుకల్లో చైర్మన్ డాక్టర్ మధుసూదన్, ఉపాధ్యాయులు

ప్రథమ చికిత్సపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఆపద సమయంలో ప్రాణాలు కాపాడే ప్రథమ చికిత్సపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డాక్టర్ కెల్ల చిన్నబాబు అన్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి భవనంలో ప్రథమ చికిత్సపై శిక్షణ గురువారం ప్రారంభమైంది. ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: నగరంలోని హడ్కో కాలనీ 11 కె.వి. ఫీడర్ నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో బలగ, ఆర్.కె.నగర్, హాస్పిటల్ కూడలి, హడ్కో కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు.

రణస్థలం: రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలోని గరికిపాలెం, గొల్లపేట, పిన్నింటిపేట, దన్నానపేట, జె.ఆర్.పురం, భావరాజుపాలెం, వైఎస్సార్ కాలనీ, నడికుదిటిపాలెం, దిగువ రణస్థలం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మినీసెంటర్లను అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలి

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ మినీసెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం ఐసీడీఎస్ కార్యాలయంలో పీడీ ప్రతినిధికి వినతిపత్రం అందజేశారు. వేసవి సెలవులు మంజూరు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు కె.కళ్యాణి, పి.లత, జె.కామేశ్వరి, పి.బాలరాణి పాల్గొన్నారు.

నేడు ఆర్మీజవాన్ మృతదేహం రాక

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ లాన్స్ నాయక్ మొదలవలస చిన్నారావు రాజస్థాన్ రాష్ట్రంలోని బికనీర్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్మీ అధికారులు మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకురానున్నారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు సమాచారం అందించారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు విమానం ద్వారా మృతదేహం తీసుకొచ్చి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గ్రామానికి తీసుకొస్తామని మృతుడి భార్య సులోచన, కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.